## 10హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయమా..?



పాలకుర్తి రూరల్, నవంబర్ 22 : 10హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయమా..? అది ఎట్లా సాధ్యం. 10హెచ్‌పీ మోటర్లు వాడితే కరెంట్ ఎంతకాలుద్ది.. పాత బోర్లు తీసి కొత్త బోర్లు వేయాలా..? 10హెచ్‌పీ మోటర్లతో బోర్లలో నీళ్లు ఉంటయా..? పైపులు ఎక్కడికక్కడ పగిలి పోతయ్. కరెంట్ తీగలు కాలి పోతయ్. కరెంట్ వాడకం పెరిగి పోతుంది. బోర్లు ఎండిపోతయ్. పొలాలు ఎండిపోతయ్. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి కరెంట్ గురించి తెలియనట్లుంది. ఇప్పుడు సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల నాణ్యమైన కరెంట్‌తో రైతులు సంబురంగా సాగు చేసుకుంటున్నాడు. రైతులు బాగు పడడం కాంగ్రెస్‌కు ఇష్టం లేకనే మూడు గంటల కరెంటు సాలంటున్నారు.

***- నిమ్మల ఐలయ్య, రైతు, దర్దేపల్లి, పాలకుర్తి మండలం***

## కాంగ్రెసోళ్లు కిరికిరి పెట్టాలని చూస్తుండ్రు..



జనగామ రూరల్, నవంబర్ 22 : గత ప్రభుత్వాల హయాంలో లంచాలు ఇవ్వనిదే పట్టా మార్పిడి అయ్యేది కాదు. దాని నుంచి రైతులకు విముక్తి కల్పించేందుకు సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. మళ్లీ కాంగ్రెస్ వస్తే ధరణిని తీసేసి పాత పద్ధతి మాదిరిగా పటేల్, పట్వారీల వ్యవస్థను తీసుకోస్తామంటున్నది. అలాగైతే భూమికి భద్రత ఉండదు. ఇది వరకే ఇబ్బందులు పడ్డాం. భూమి ఒక్కరిదైతే రికార్డుల్లో మరో కాలం పెట్టుడు ఎందుకు. ఇద్దరి మధ్య కిరికిరి పెట్టుడెందుకు. ధరణి తీసివేస్తామని రైతుల దగ్గరకు వచ్చి చెప్పండి అప్పుడు తెలుస్తుంది కాంగ్రెస్ వాళ్లకు. ఏది చెబితే అది నమ్మడానికి ఇక్కడ ఎవరూ లేరు. కాంగ్రెస్ విధానం మారాలి.

***- బంద్రు సత్తయ్య, రైతు పెంబర్తి గ్రామం, జనగామ మండలం***





కాట్రపల్లిలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో పాల్గొన్న శ్రేణులు

## గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరం

రాయపర్తి, నవంబర్ 22 : మండలంలోని 40గ్రామపంచాయతీల్లో బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు స్థానిక నాయకులతో కలిసి గడపగడపకూ వెళ్లి ఓటర్లను కలిశారు. చేసిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల కేంద్రంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్ల సుధీర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ గారె నర్సయ్య, కాట్రపల్లిలో మండల నాయకుడు గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు మండల శ్రీధర్, మహ్మద్ అన్వర్‌లు పాల్గొని ప్రజలతో భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పెర్కవేడు, కొత్తూరు, మైలారం, తిర్మలాయపల్లి, గన్నారం. కొండూరు, సన్నూరు, కొండాపురం తదితర గ్రామాల్లో శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించారు.



గిరిజనులతో కలిసి సమ్మేళనానికి వెళ్తున్న వీరూనాయక్

## ఆత్మీయ సమ్మేళనానికి తరలిన గిరిజనులు

రాయపర్తి, నవంబర్ 22 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గిరిజన సమన్వయ ఆత్మీయ సమ్మేళనానికి మండల వ్యాప్తంగా గిరిజనులు తరలివెళ్లారు. పన్యానాయక్ తండాకు చెందిన బీఆర్‌ఎస్ గిరిజన సెల్ నాయకుడు, దయన్న యువసేన మండల వ్యవస్థాపక అధ్యక్షుడు బాధావత్ వీరూనాయక్ ఆధ్వర్యంలో పలు గిరిజన తండాల్లోని గిరిజనులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో తరలివెళ్లారు. వీరూనాయక్ తన సొంత ఖర్చులతో 250 గులాబీ కండువాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దయన్న యువసేన కార్యకర్తలు భూక్యా శ్రీనివాస్, నునావత్ బాలునాయక్, భూక్యా యాకూబ్, శివనాయక్ పాల్గొన్నారు.

## ‘ఎర్రబెల్లి’ని భారీ మెజార్టీతో గెలిపించాలి

**ఇంటింటా ప్రచారంలో ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు**

పాలకుర్తి, నవంబర్ 22 : అందరి క్షేమం కోరుతూ పని చేసే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆశీర్వదిస్తే మీ కష్ట సుఖాల్లో తోడుగా ఉండి అండగా నిలుస్తారని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు అన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోరుతూ బుధవారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఉషాదయాకర్‌రావు అప్యాయంగా ఫలుకరిస్తూ తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుకు వేసి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్వార్థ రాజకీయాలు చేస్తున్న వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పాలకుర్తిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. లక్ష్మీ నారాయణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు ఉషాదయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

# హామీలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌దే

- **కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే ఆగమైతం..**
- **మూడు గంటల కరెంట్‌తో వ్యవసాయం సాధ్యమేనా..?**
- **అభివృద్ధికి అండగా నిలవండి..**
- **బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు**
- **రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సుధాకర్‌రావుతో కలిసి ప్రచారం**



చిట్యాలలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర, నవంబర్ 22 : ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది అయితే.. ఇచ్చిన హామీలను ఎగబెట్టి ప్రజలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్, బీజేపీలదని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నవంగర, చిట్యాల, బొమ్మకల్లు, పెద్దవంగర గ్రామాల్లో నిర్వహించిన ఎన్నకల ప్రచారానికి మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు హాజరయ్యారు. డప్పుచప్పుళ్లు, బతుకమ్మలు, బోనాలతో వారికి ఆయా గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. రేలారే రేలా ఫేమ్ గంగ, ఫోక్ సింగర్ కనకవ్వ పాటలతో, జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి ఆట పాటలు అలరించాయి. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. పాలకుర్తి ప్రజలు ఎంతో తెలివైనవారన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ఏకమై..కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలన్నారు. ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే అన్నారు. కాంగ్రెస్ అంటున్నట్లు మూడు గంటల కరెంట్‌తో వ్యవసాయం సాధ్యమవుతుందా..? మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సుధాకర్‌రావు పాలనలో కాలువలు తవ్వారు.. కాంగ్రెస్ వచ్చి నీళ్లు తేలే... నీళ్ల కోసం తన్నులు తిని జైలుకు పోయిన.. కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎట్ల ఉండే.. సీఎం కేసీఆర్ వచ్చిన తరువాత ఎట్లా ఉంది అనేది ప్రజలు ఆలోచించాలన్నారు. రైతు సంక్షేమానికి జైళ్లకు వెళ్లాను, కొట్లాడి నీళ్లు తెచ్చానన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న అత్తాకోడళ్ల మాటలు నమ్మొద్దని మంత్రి తెలిపారు. వారు ప్రజలను మభ్యపెడుతున్నారఅన్నారు. పాలకుర్తికి కర్ణాటక.. ఢిల్లీ నుంచి.. బీజేపీకి ఢిల్లీ నుంచి నాయకులు వచ్చినా ఒరిగేది ఏమీలేదన్నారు. రాష్ట్రంలో మూడోసారి సీఎం కేసీఆర్ కావడం ఖాయమన్నారు. ‘‘మీ మధ్య ఉండి.. మీ ఇంటి మనిషిగా ఉన్నా.. నన్ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా’’.. అని మంత్రి అన్నారు.

### మోసపూరిత హామీలకు ఆగం కావొద్దు..

**మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సుధాకర్‌రావు**

సీఎం కేసీఆర్ సారథ్యంలో పోరాడి తెచ్చుకున్న తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని, విపక్షాల మోసపూరిత హామీలతో ఆగం కావద్దని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ ప్రపంచంలోనే ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని, ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తీర్చడానికి నేనున్నానని సుధాకర్‌రావు తెలిపారు. ప్రజల మనిషిగా నిత్యం ప్రజలతో ఉండి పద్ధతిగా పని చేసే మంత్రి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి, జడ్పీటీసీ జ్యోతిర్మయి, పాలకుర్తి దేవస్థాన, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, మండల ఇన్‌చార్జీలు సోమేశ్వర్‌రావు, గోపాల్‌రావు, సర్పంచులు లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, దీపికారెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, రవీందర్‌నాయక్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ సోమారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, బీఆర్‌ఎస్ నాయకులు సోమనర్సింహారెడ్డి, యాదగిరిరావు, సుధీర్‌కుమార్, సునీల్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, వెంకటయ్య, రహీముద్దీన్, వెంకట్రామయ్య, ఆయా గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలి

**ఎన్నికల ప్రచారంలో మంత్రి ఎర్రబెల్లి**



ఉత్సాహంతో మంత్రి ఎర్రబెల్లిని ఎత్తుకుంటున్న పార్టీ శ్రేణులు

కొడకండ్ల, నవంబర్ 22 : నాటి కాంగ్రెస్ పాలనలోని కరెంటు కష్టాలు మళ్లీ కావాలా..? 24 గంటల ఉచిత కరెంట్‌తో పచ్చని మూడు పంటలతో సాగు సంబురం కావాలా..? మీరే ఆలోచించుకోవాలని బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలకేంద్రం తోపాటు, మండలంలోని లక్ష్మక్కపల్లి, రామన్న గూడెం గ్రామాల్లో ఎర్రబెల్లి చారిటల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు డప్పుచప్పుళ్లు, కోలాట బృందాలు, నాట్యాలు, బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని ప్రచార సభలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కేటీఆర్‌ను ఒప్పించి కొడకండ్లలో మినీటెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, కటిక చీకట్లు చూసినమని, మళ్లీ ఆ రోజులు మనకొద్దన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అభివృద్ధిని చూసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సిందే రామోజీ, ఎంపీపీ ధరావత్ జ్యోతి, ఏఎంసీ చైర్మన్ పేరం రాము, టీఎస్‌ఈజీసీ సభ్యుడు అందె యాకయ్య, జడ్పీటీసీ కేలోత్ సత్తెమ్మ, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు దీకొండ వెంకటేశ్వర్‌రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పసునూరి మధుసూదన్, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, ఏఎంసీ డైరెక్టర్ కుందూరు అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రెడ్డి కులస్తులకు అండగా నిలిచా

**ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి దయాకర్‌రావు**

తొర్రూరు, నవంబర్ 22 : రైతు బిడ్డలుగా, వ్యాపారవేత్తలుగా, ఉద్యోగస్థులుగా వివిధ రంగాల్లో రాణిస్తున్న రెడ్డి కులస్తులకు తాను అండగా నిలిచానని, వారు చేపట్టిన కార్యక్రమాలకు చేయూతనందించానని, తన రాజకీయ జీవితంలో ఎంతో మంది రెడ్డి ఆత్మ బంధువులతో మంచి సంబంధాలు కలిగి ఉన్నానని పాలకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త కుందూరు రామకృష్ణారెడ్డి షష్టిపూర్తి సందర్భంగా నాంచారిమడూర్‌లోని రెడ్డి గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. కుందూరు వెంకట వరప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రెడ్డి సోదరుల కష్ట సుఖాల్లో వారి వెన్నంటే ఉంటానన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని దేవాలయాలను కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకున్నది లేదన్నారు. తను అన్ని దేవాలయాలను కోట్లాది రూపాయల ఖర్చుతో అభివృద్ధి చేశానన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో ఎక్కువ శాతం వ్యవసాయదారులే ఉన్నారన్నారు. రైతు శ్రేయస్సుకు కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. రైతుబంధుని ఎకరాకు రూ.10వేల నుంచి ఇప్పుడు రూ.16వేలకు, వరి ధాన్యానికి కూడా రూ.500నష్టంతో అయినా సరే రూ.2వేల మద్దతు ధర ఇచ్చుకుంటున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయం చేసే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుందూరు కరుణాకర్ రెడ్డి, గూడూరు నరసింహారెడ్డి, కే చిత్తరంజన్‌రెడ్డి, కిశోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు